# సన్న్యాసము

శ్రీమతి బి. జ్ఞానాంబగారు

౧

మహారాణి—పుత్రా!.........

తరుణరాజకుమారుడు—అమ్మా! నాకు వివాహ మక్కరలేదు.

మహారాణి—(బాష్పరుద్ధకంఠముతో) "నా యీచిన్నికోర్కెను నెరవేర్పుము.

* * *

శ్రావణసజలసంధ్య. మగధ మహారాజకుమారుఁడు రోహితాశ్వదుర్గమందలి ఉన్మత్తవాతాయనాభిముఖుఁడై నిలిచియుండెను. పంకకళంకితజలప్రపూర్ణయగు స్వర్ణభద్ర ఉత్తుంగతరంగములతోఁ గ్రీడించుచుండెను. మేఘాచ్ఛన్నధూమలాకాశము మీదను—జలమగ్నధరిత్రీమధ్యమునను—క్షితిజములపైనను ప్రకాశించుచున్న సంధ్యారుణప్రభ విశ్వవిమోహినియైన ప్రకృతీదేవి ధరించిన సిందూరరేఖను స్ఫురింపఁ జేయుచుండెను. శ్రావణసజలశృంగారసంధ్య. మగధేశ్వరి సాశ్రునయనములతో రాజకుమారుని గంభీరముఖమండలమును తిలకించుచుండెను. స్వర్గమందలి పవిత్రప్రకాశధార భూతలముపైఁ బ్రవహించినట్లు వాతాయనమార్గమునుండి స్వర్ణనిభ సంధ్యాప్రభ వారిరువురిపైఁ బ్రసరించుచుండెను.

మహారాణి—ప్రియవత్సా! నాయీవృద్ధనేత్రముల కిది అంతిమవాంఛ.

రాజకుమారుడు—అమ్మా! సరేగాని యీస్వర్ణభద్రానది తన స్వాప్నికసంపద కెంత పొంగిపోవుచున్నదో చూడుము. నిన్నమొన్నటివరకు దీని నిశ్శబ్దోత్సంగమునందు అనంతవాలుకారాశీసమేతుఁడై ప్రభంజనుఁడు ప్రళయతాండవమును గావించుచుండెను.

మగధేశ్వరి చేలాంచలముతోఁ గన్నీటి నాపుకొనుచు నిష్క్రమించెను.

స్వర్ణభద్రానది విశాలహృదయమందలి సంకల్పవికల్పసంఘర్షణముభంగి తరంగమాలికలు ఎగిరిపడుచుండెను.

౨

నవయౌవనమదోన్మత్త—పాంచాల రాజకుమారి రాజకుమారునితో నిట్లనెను—ఆర్యా! మీరు కడు నీరసముగ నున్నారు.

రాజకుమారుఁడు 'ధమ్మపదము'ను పఠించుచుండెను. తథాగతుని మహిమామండితప్రశాంతతపోమగ్నమూర్తి అతని సుకుమారహృదయశతపత్రముపై విరాజమానమగుచుండెను. రాజకుమారుఁ డొకయనిర్వచనీయసుఖానుభూతిలో మైమరచుచుండెను. చైత్రసమీరుఁడు వనకుసుమసౌరభములఁ గొనితెచ్చి ఆయేకాంతగృహమున విడుచుచుండెను.

దుర్గహర్మ్యముపై సుఖోపవిష్టమైయున్న కపోతమిథునము చంచువులతో నొండొంటిని చుంబించుకొనుచుండెను. గానగర్వితపరభృతబృందముతోడను—మధుపానమత్తమధుపసమూహముతోడను వనములన్నియు నిండియుండెను. ప్రకృతి తనసౌందర్యమునకు తానే ఆశ్చర్యముగ్ధయైనది.

రాజకుమారి అన్యమనస్కుఁడైన రాజకుమారుని యొడిలోనున్న గ్రంథమునెత్తి దూరముగాఁ బారవైచెను.

రాజకుమారుఁ డొకదీర్ఘనిశ్శ్వాసమును విడిచి కిటికీవైపు దృష్టినిగిడించెను. కాని అతనినేత్రములకు హృదయముతో సంబంధము లేకుండెను. అభిమానినియగు రాజకుమారి శరవిద్ధకురంగిపగిది తూలిపోయెను. భువనమోహనలావణ్యమున కిట్టి తిరస్కారమా—ఉఫ్!

చకితస్వరముతో కోయిలకూసెను. కించిదుష్ణశీతలసమ్మిళితసమీరసంస్పర్శనముచే రాజకుమారుని నేత్రాంచలములు బరువెక్కినవి. రాజకుమారి కఠినస్వరముతో నిట్లనెను.

"రాజకుమారా! మీరు వివాహమాడరా?"

రాజకుమారుఁ డామెవంక వీక్షింపకయే దృఢ

వ్యంజకస్వరముతో నిట్లనెను.

"లేదు. సన్యాసమును స్వీకరించెదను."

"ఎందుకు?"

రాజకుమారుఁడు ప్రత్యుత్తర మొసంగలేదు. వసంతవాతాహతిచే రాజకుమారి మేలిముసుఁగు తొలఁగి పోయెను. ఆమెవక్రాలకములు చిరుతరఁగలవలె గాలిలో నెగురఁజొచ్చెను.

ఇంత ఉపేక్షయా? నారీహృదయమింతటి యుపేక్షణీయమా? రాజకుమారి వెడలిపోయెను. ఆమె గంభీరచరణపాతధ్వనులచే వాయుమండలము క్షుబ్ధమయ్యెను.

వసంతానిలుఁడు రాజకుమారుని చెంపపై యొక మృదుచపేటమును ప్రసాదించి 'మూర్ఖా!' అనెను.

రాజకుమారుఁడు చకితుఁడై హృదయముపై చేయియిడుకొని తనలోమరల 'మూర్ఖా!'అనుకొనెను.

ఆశ్రమనికుంజమునుండి కోయిల 'కుహూ'నినాదమొనరించెను.

## 3

రాజకుమారి తనమేనత్తయైన మగధేశ్వరి నిట్లడిగెను.

"మాతాజీ! నాప్రతిమను నిర్మించుట కొక మణుగు బంగారు కావలసియున్నది."

రాజకుమారి యభీష్టము తత్క్షణమే నెరవేర్పఁబడెను. చతురస్వర్ణకారుల సమ్మెటప్రేటులచే రోహితాశ్వదుర్గము ప్రతిధ్వనించి పోవుచుండెను. రాజకుమారి స్వర్ణకారుల కిట్లాజ్ఞాపించెను.

"మీరు నిర్మించుచున్న ప్రతిమ సరిగా నన్నుఁబోలియుండవలెను. లేనియెడల మీ హస్తములు తుందునుకలై పోగలవు."

ప్రతిమ తయారయ్యెను. స్వర్ణకారుల కళావిభవమందు సువ్యక్తమగుచుండెను. ప్రేక్షకు లాప్రతిమ నవలోకించి ఆశ్చర్యవిహ్వలులైరి.

సన్మాననదిన మేతెంచెను. గజాశ్వములు—వస్త్రభూషణములు—కాంచనరత్నములు స్వర్ణకారదళమునకు సమర్పింపఁబడెను.

స్వర్ణప్రతిమ రాజకుమారి యేకాంతగృహమునఁ బ్రవేశపెట్టఁబడెను. రాజకుమారి తనవస్త్రభూషణములచే దానినలంకరింపఁజేసి అద్దమునెదుట నిలిపెను. తాను దానిపార్శ్వమున నిలిచెను. ఒకక్షణమైన పిమ్మట రాజకుమారి యున్మాదినిఁబోలె ప్రతిమను దూరముగా నెట్టివైచి యిట్లనెను.

"గయ్యాళీ! దూరముగానుండుము. నాతో స్పర్ధ నీకేల?"

రాజకుమారియొక్క యీయపూర్వసాఫల్యమునకు నిదర్శనముగా స్వర్ణకారులు మరల బహూకరింపఁబడిరి. స్వర్ణప్రతిమ భావిభిక్షుకుఁడగు రాజకుమారుని శయనగృహమందు ప్రవేశపెట్టఁబడెను.

## 4

శయనమందిరమందలి రత్నఖచితశయ్యపై నాసీనుఁడై రాజకుమారుఁడు విచారదృష్టితో స్వర్ణప్రతిమను వీక్షించుచుండెను. తివాసీపైనొకమూల 'దమ్మపద', 'త్రిపిటక' గ్రంథములును—సప్తస్వరగర్భితయగు రాజకుమారి వీణెయు తిరస్కృతావస్థలో పడియుండెను. బుద్ధవిగ్రహము మెడలో వాడిపోయిన పుష్పహారమొకటి వ్రేలాడుచుండెను.

ఫాల్గుణ మధ్యనిశ. రజనీగంధభారవహుఁడగు మలయానిలుఁ డాశయనగృహమందు మెల్లమెల్లగాఁ బ్రవేశించెను. స్వర్ణప్రతిమాసౌందర్యము నపహరింపఁగోరి కాబోలు శశికిరణములు గవాక్షములనుండి తొంగిచూచుచుండెను.

సుఖస్వప్నమువోలె రాజకుమారిమందిరమునఁ బ్రవేశించెను. ఆమెపాదశబ్దప్రహారముచే రాజకుమారుని యేకాగ్రతాతంతుజాలము ఛిన్నభిన్నమై పోయెను. రాజకుమారి కపటమందహాసముతో నిట్లు ప్రశ్నించెను.

"సాధకప్రవరా! సన్యాసము నెప్పుడు స్వీకరింప నిశ్చయించితిరి?"

రాజకుమారుఁడు ప్రతిమపైనున్న దృష్టిని మరలించుకొని యొకవేడినిట్టూర్పుఁబుచ్చి యిట్లువచించెను,

"నాకిప్పుడు సన్యాసముపై వాంఛలేదు. వివాహమాడెదను."

"ఎవరి కట్టి సౌభాగ్యప్రదానముఁ గావింతురు.?"

రాజకుమారుఁడు మారుమాటాడక స్వర్ణప్రతిమవైపు వ్రేలుఁజూపించెను.

* * *

రాజకుమారియొక్క అగరుధూపవాసిత కుంచితాలకములతో నాడుకొనమరగి మలయానిలుఁడామందిరమందలి దీపశిఖను వ్యాకులమొందించెను. పాప మాయభాగ్యశాలిని రెండుమూడుపర్యాయములు తలపంకించి అంధకారగర్భములో నదృశ్యయయ్యెను కుండలీకృతధూమరాశి గృహోపరిభాగమునకు సాగిపోయెను.

ఫాల్గుణపౌర్ణమీజ్యోత్స్నాస్నాతరజనీనిర్వాతవేళయందు రాజకుమారుఁడపరాధిమాడ్కి వినమితమస్తకుఁడై కూర్చొనియుండెను. అతనియెదుట మహామహిమామయియగు దేవీమూర్తివోలె విజయినియైన పాంచాలరాజకుమారి నిలిచియుండెను.

—అనువాదము.

# మాఘము

హరి రాధాకృష్ణమూర్తిగారు

యౌవనమీని యాసతములై పవమానకిశోరుఁడింత సం
భావనసేసిన న్గలకఁబారి కృశించిన శాలియష్టులం
బోవగనూడ్చి రమ్యమయిపొల్చు వినూతనయోషధీరమన్
భూవనితందలిర్చు పరిపూర్ణవిలాసిని నీకు సేమమా.
జలజలమంచు ప్రూకులను జారెడి సంజమెరుంగుటాకులన్
బలపలనద్రులంబొదలు వన్యమృగీమృగశాబకంబులన్
బిలబిలమంచు నొక్కగతిఁ బేరటమొప్పఁజరించు పత్రులన్
జలనములేనిభూతములఁ జాలనముందలపింతు మాఘమా!
పదిదివసంబు లొక్కమొగిఁ బట్టినబాణము ద్రిప్పకుండ దా
నుదితదివాకరుండొ పరులోపని చిచ్చరకంటివాడొ నా
బదరఁజరించి వేల్పులు సెబాసననైరులఁ జెండినట్టి మా
ముదుసలికౌరవుండు ప్రియముం బచరించుచు నున్నవాఁడటే.
అలుకలురావు కాని యుదయంబున వన్నెకునెక్కునాశలుం
దలఁపునఁబోవు విస్మయముతారదు ముందుకువెన్కకెంతయున్
గలియగఁబ్రాకుగాని యలికంబునఁ గార్యము గానబట్ట దీ
యలసత కేమిహేతువొ? ప్రియా, సరిప్రొద్దుల నీవు జేర్చినన్.

మకరములు కుంభములు నీకు మానసముల
నిచ్చుచెలికత్తియల! వానికెల్ల నొడయ
డగుట శని నీదు హృదయంబు నరయ సలిల
సన్నిభంబు పాషాణంబు లున్నఁగాని.